సమ్మిట్ సందడి

- రెండో రోజూ అదే జోష్
- జీఐఎస్ సదస్సు విజయవంతం



సచివాలయ సిబ్బంది సెల్ఫీ

ఏయూక్యాంపస్: విశాఖ వేదికగా ఆంధ్రవిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ రెండో రోజు శనివారం విజయవంతంగా ముగిసింది. సదస్సులో పాల్గొనడానికి ఉదయం నుంచి పెద్దసంఖ్యలో పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ప్రవేశ మార్గం వద్ద ప్రతీ ఒక్కరిని గుర్తింపు కార్డులు, క్యూఆర్ కోడ్‌ను పరిశీలించి లోపలికి అనుమతించారు. సదస్సు ప్రాంగణంలో పోలీసులు బాంబ్ స్క్వాడ్, స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. సదస్సు నిర్వహణలో ఎటువంటి భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా పోలీసులు ప్రశంసనీయ పాత్ర పోషించారు.

విజయవంతమైన సదస్సు..
రెండు రోజుల జీఐఎస్ సదస్సు పూర్తి స్థాయిలో విజయవంతమైంది. పెద్ద సంఖ్యలో పారిశ్రామికవేత్తలు రెండో రోజు సైతం హాజరయ్యారు. విభిన్న వేదికలపై ఏకకాలంలో పెట్టుబడులకు సంబంధించి పారిశ్రామిక వేత్తలు ఎంవోయూలు కుదుర్చుకున్నారు. వచ్చిన లక్ష్యం నెరవేరడంతో సదస్సుకు వచ్చిన పారిశ్రామిక వేత్తల్లో జోష్ కనిపించింది. పలువురు పారిశ్రామిక వేత్తలు సదస్సు ప్రాంగణంలో సెల్ఫీలు తీసుకుంటూ కనిపించారు. ముఖ్యంగా రాష్ట్రంలో పరిశ్రమలు, పెట్టుబడులు పెట్టడానికి యువత రావడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయం స్టాల్ మంచి ఆదరణ పొందింది. వార్డు/గ్రామ సచివాలయ వ్యవస్థ ప్రత్యేకతలను వివిధ దేశాల ప్రతినిధులకు సిబ్బంది వివరించారు. ఏపీలో సచివాలయ వ్యవస్థ ద్వారా అందిస్తున్న సేవలను ప్రతినిధులు ప్రశంసించారు.

విద్యార్థుల సందడి..
సదస్సులో రెండో రోజున విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ఆంధ్రా యూనివర్సిటీతో పాటు నగరంలోని పలు కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో జరుగుతున్న ఎంవోయూలు, సెషన్స్‌ను వీక్షించడానికి, నూతన జ్ఞానాన్ని పొందడానికి ఆసక్తి చూపారు. దీంతో సమ్మిట్ ప్రాంగణం విద్యార్థులతో కళకళలాడింది. మేనేజ్‌మెంట్, టెక్నాలజీ రంగాల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు సదస్సులో పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో విదేశీ విద్యార్థులు సైతం హాజరయ్యారు.


గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సుకు వస్తున్న ప్రతినిధులు

నెట్‌వర్క్ డెవలప్‌మెంట్..
విభిన్న రంగాలలో పనిచేస్తున్న నిపుణులు తమ నెట్‌వర్క్‌ను డెవలప్ చేసుకోవడానికి ఈ సదస్సును వేదికగా మలుచుకున్నారు. విభిన్న సంస్థల్లో పనిచేస్తున్న అధికారులు, నిర్వాహకులతో మాట్లాడారు. తాము పనిచేస్తున్న రంగాలను ఆయా సంస్థలతో అనుసంధానించే దిశగా చర్చలు జరిపారు. పరోక్షంగా అనేకమంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు ఈ సదస్సు ఒక మంచి వేదికగా నిలచి వారి పరిధిని విస్తృతం చేసుకోవడానికి అవకాశం ఏర్పడింది.

భారతీయ కళలకు ఫిదా

పలువురు భారతీయ కళలకు ఫిదా అయ్యారు. ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన బొబ్బిలి వీణ నుంచి శ్రావ్యంగా వచ్చే సంగీతాన్ని వింటూ విదేశీయులు తన్మయత్వానికి లోనయ్యారు. సర్వసిద్ధి లక్ష్మణ స్వామి బొబ్బిలి వీణపై శ్రావ్యంగా స్వరాలను పలికిస్తుంటే విదేశీయులు తెుల్‌ఫోన్లతో వీటిని చిత్రీకరించారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. యలమంచిలికి చెందిన జయవాణి అక్కడిక్కడే తాటాకుతో దండలు చేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. చేనేత మగ్గాన్ని ప్రదర్శనలో ఉంచారు. తోలు బొమ్మలు, హస్తకళా రూపాలు, చేనేత వస్త్రాలను చూడడానికి భారతీయులతోపాటు, విదేశీయులు ఆసక్తి చూపారు.


విదేశీ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఔత్సాహికులు


బొబ్బిలి వీణను కెమెరాలో బంధిస్తున్న విదేశీయులు

సీఎం జగన్‌ను కలిసిన ఫారూఖీ



విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్-2023లో పాల్గొనడానికి విచ్చేసి రుషికొండ రాడిసన్ బ్లూ హోటల్‌లో బసచేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శనివారం వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఐ.హెచ్.ఫారూఖీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఫారూఖీని సీఎం అభినందించారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు.

– మహారాణిపేట

ఘనంగా భద్రతా దినోత్సవం

సింధియా: హిందుస్థాన్ షిప్‌యార్డ్ సంస్థలో శనివారం 52వ జాతీయ భద్రతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులు 'మా లక్ష్యం హాని శూన్యం' అని భద్రతా ప్రతిజ్ఞ చేశారు. 2022–23వ ఆర్థిక సంవత్సర త్రైమాసికంలో 4 వేల మందికి హిందుస్థాన్ షిప్‌యార్డ్ భద్రతా క్యూ కార్డులను జారీ చేసింది. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సంస్థ కార్పొరేట్ ప్లానింగ్ అండ్ పర్సనల్ డైరెక్టర్ సీడీఆర్ జేసీ గుప్తా ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. పోటీ విజేతలకు బహుమతులు అందజేశారు.

క్లుప్తంగా

వారంలో రెండు రోజులు వ్యాక్సినేషన్ తప్పనిసరి

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు


ఆరోగ్య కేంద్రంలో పిల్లల వ్యాక్సినేషన్‌ను పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రతి బుధ, శనివారాల్లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. తాటిచెట్లపాలెం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో శనివారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలిచ్చారు. వ్యాక్సిన్ కోసం వచ్చిన పిల్లల తల్లిదండ్రులకు వ్యాధి నిరోధక టీకాల ఆవశ్యకతను డీఎంహెచ్‌వో తెలియజేశారు. టీకాలు వేయించుకోవాల్సిన పిల్లల జాబితా, వ్యాక్సినేషన్ నిమిత్తం సెషన్ ప్లానింగ్, శిశువుల జాబితా తయారు చేసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. వ్యాక్సిన్ క్యారియర్‌లో ఐస్ ప్యాక్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన..
ముస్లిం తాటిచెట్లపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు సందర్శించారు. అక్కడి ఐసీడీఎస్ సిబ్బందికి మధ్యాహ్న భోజన పథకంలో అందించే పోషకాహారం గురించి వివరించారు. పిల్లలందరి ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకొని పలు సూచనలిచ్చారు. పలువురు వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి విశేష పూజలు


కలియుగ వెంకన్నకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న కమిటీ సభ్యులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వరుడి ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి జగన్నాథశర్మ, శంకరశర్మ నేతృత్వంలో వేకువజాము నుంచి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాత సేవ అనంతరం పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్న స్వామికి ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన, మంగళ శాసనాలు, పంచామృతాభిషేకాలు జరిపారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవ రావు, గంటా కామరాజు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న మెట్ట దమయంతి

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త, 251 బూత్ మెంబర్ పేడాడ చిరంజీవి రెండు కిడ్నీలు చెడిపోయి చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు వార్డు కార్పొరేటర్ సహా పలువురు ఆర్థికంగా సహాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఆ వార్డుకు చెందిన పార్టీ మహిళా నాయకురాలు మెట్ట దమయంతి శనివారం రూ.5 వేల ఆర్థిక సాయం చేశారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ చేతుల మీదుగా నగదును వైద్య ఖర్చుల నిమిత్తం చిరంజీవికి అతడి నివాసంలో అందించారు.

ప్రైవేటు స్కూళ్ల సమస్యలపై మంత్రి బొత్సకు వినతి


మంత్రి బొత్స సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న ప్రైవేటు స్కూళ్ల సంఘ సభ్యులు

కంచరపాలెం: ప్రైవేటు స్కూళ్లు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏపీపీఎస్‌ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్, విశాఖ జిల్లా అధ్యక్షుడు జె.సోమశేఖర్ నేతృత్వంలో శనివారం రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం ఫ్రీ సీట్ల విషయం, ఏప్రిల్‌లో జరగబోయే ఎస్‌ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో సైన్స్ సబ్జెక్ట్ విషయంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై మంత్రి బొత్స సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు. పదేళ్ల రికగ్నిషన్ ఇమ్మని కోరగా.. ఐదేళ్లకు ఇవ్వడంతో ఏపీపీఎస్‌ఏ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు, జీవైపీఎస్‌ఏ గాజువాక అధ్యక్షుడు భాస్కరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి చీకటి రమేష్, బి.శ్రీనివాసరావు, మురళీ సుందరం, గణపతిరావు తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.

టెన్త్ ప్రిపరేటరీ-2 పరీక్షలు ప్రారంభం


మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో పరీక్ష రాస్తున్న పదో తరగతి విద్యార్థులు

సీతంపేట: జీవీఎంసీ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రిపరేటరీ-2 పరీక్షలు శనివారం మొదలయ్యాయి. మొదటి రోజు ఉదయం తెలుగు, మధ్యాహ్నం మ్యాథ్స్ పరీక్షలు జరిగాయి. మొత్తం సిలబస్‌ను రెండు భాగాలుగా విభజించి ప్రిపరేటరీ-1, ప్రిపరేటరీ-2గా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్టు 50 మార్కులకు, గంటన్నర వ్యవధిలో పరీక్ష రాయాల్సి ఉంటుంది. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో రెండు సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయిని శాంతికుమారి మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 20 వరకు ప్రీఫైనల్ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. విద్యార్థులు ఎంతవరకు పరీక్షలకు సన్నద్ధమయ్యారో తెలుసుకోవడానికి ప్రిపరేటరీ పరీక్షలు దోహదపడతాయన్నారు. ఏప్రిల్ 3 నుంచి ఫైనల్ పరీక్షలు జరుతాయని, ఇక 30 రోజులే మిగిలి ఉన్నాయని చెప్పారు. మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు.

కెమ్‌ప్లెయిర్‌లో గైస్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ, సిబ్బంది

మురళీనగర్: అనిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో ఇటీవల నిర్వహించిన కెమ్‌ప్లెయిర్-2023లో పాల్గొన్న కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా శనివారం వారిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ, ఇతర సిబ్బంది అభినందించారు. నాలుగు అంశాల్లో తయారు చేసిన ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించి నగదు బహుమతి పొందారు. వీటిని న్యాయనిర్ణేతలు ప్రశంసించారు. ఎఫెక్ట్ ఆఫ్ సాయిల్ ఫెర్టిలిటీ డ్యూ టు స్పిల్లేజ్ ఆఫ్ పెట్రోలియం హైడ్రోకార్బన్స్ అనే అంశంలో ఎల్.తేజ, బి.ప్రియ, ఎంఎస్‌ఎస్ వర్షిణి ప్రథమ బహుమతి సాధించారు. కెమికల్ ఇంజినీరింగ్ క్రాస్ వర్డ్ ప్రాజెక్టులో సీహెచ్ మేఘనారెడ్డి, టి.కావ్యచంద్రిక నగదు బహుమతి అందుకున్నారు. వీరితో పాటు ఇతర అంశాల్లో పాల్గొన్న ఎ.గణేష్, పి.లక్ష్మణ్‌చరణ్, ఎ.మౌనిక ప్రియ, పి.జాహ్నవిలకు ప్రశంసాపత్రాలను అందించారు. ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ, కెమికల్ ఇంజినీరింగ్ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, పెట్రోకెమికల్స్ హెచ్‌వోడీ సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, సీనియర్ లెక్చరర్లు ఎం.బోధమ్మ, కేబీవీఎస్ కుమార్, ఎం.తిరుపతి, బి.స్మిత విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

సీతంరాజును గెలిపించాలని ప్రచారం


49వ వార్డులో గ్రాడ్యుయేట్‌కు కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు,అల్లు శంకరరావు


50వ వార్డులో కరపత్రం అందిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మర్రిపాలెం: జీవీఎంసీ 49వ వార్డు ఎన్‌జీజీవోఎస్ కాలనీలో శనివారం కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డులోని పట్టభద్రులను కలిసి, ఈ నెల 13న జరగబోయే ఎన్నికల్లో తమ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఎస్.రవికుమార్, ఐ.రవికుమార్, జె.వెంకటరావు, చిన్నారావు, భవాని శంకర్, మస్తాన్, దేముడు, దివాకర్, శంకర్, మున్న, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

50, 53 వార్డుల్లో..
మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డు సత్యానగర్, మాధవధార, అశోనగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఓటు వేసే విధానాన్ని వివరించారు.

- 53వ వార్డులో కార్పొరేటర్ బర్కత్ అలీ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. 295, 296, 297 సచివాలయాల పరిధిలోని ఎఫ్‌సీఐ పార్కు ఏరియా, హర్షనగర్, శివనగర్-2 ప్రాంతాల్లో గ్రాడ్యుయేట్లను కలిసి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

భద్రతా విధానాలపై అవగాహన అవసరం


భద్రతా విభాగం ప్రాధాన్యాన్ని వివరిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: పరిశ్రమల్లో భద్రతా విధానాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. సమగ్ర శిక్ష సౌజన్యంతో పరిశ్రమల సందర్శనలో భాగంగా గోపాలపట్నం ఉన్నత పాఠశాల 6, 7, 8 తరగతుల విద్యార్థులు శనివారం కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీలోని సేఫ్టీ విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇక్కడి కళాశాలలో ఫైర్ అండ్ సేఫ్టీ, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సులను ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పరిశ్రమలు, సంస్థల రక్షణలో సేఫ్టీ విభాగం ఎంతో కీలకమైనదని వివరించారు. ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఫైర్ సేఫ్టీపై అవగాహన కల్పించారు. సేఫ్టీ విభాగం అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల సమయంలో నష్ట నివారణకు చర్యలు తీసుకుంటుందన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో కూడా సేఫ్టీ విభాగాలు పనిచేస్తాయన్నారు. విద్యార్థులు ఇంటర్, డిగ్రీ తర్వాత సేఫ్టీ కోర్సులు చేయడం ద్వారా అత్యధిక వేతనాలతో ఉద్యోగాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ చెప్పారు. అనంతరం ఫైర్‌సేఫ్టీలో ప్రయోగాత్మక విధానాన్ని విద్యార్థులు అధ్యయనం చేశారు. వివిధ పరికరాల ఉపయోగాలను స్వయంగా పరిశీలించి తెలుసుకున్నారు. సేఫ్టీ విభాగాల ఇన్‌చార్జులు డాక్టర్ బి.వి.లక్ష్మణరావు, ఎ.వరహాలు వివిధ సేఫ్టీ పరికరాల ఉపయోగాలను వివరించారు. విద్యార్థులకు గైడ్‌గా సూర్రెడ్డి బాబూరావు, పీడీ అవగడ్డ సత్యకళ, ఎన్‌సీసీ విభాగం ఇన్‌చార్జి రొంగలి నాగేంద్రజోగి, ఎస్‌ఎస్ టీచర్ స్వప్నసుందరి వ్యవహరించారు.

ఎనిమిదేళ్ల బాలికకు డెంగ్యూ

సీతంపేట: జీవీఎంసీ 44వ వార్డు శ్రీనివాసనగర్‌లో నివసిస్తున్న ఎనిమిదేళ్ల బాలిక డెంగ్యూ జ్వరం బారిన పడింది. అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ, జీవీఎంసీ సిబ్బంది శనివారం బాలికను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, ప్లేట్‌లెట్స్ సంఖ్య తీసుకుంటున్న చికిత్స అడిగి తెలుసుకున్నారు. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. బాలిక ఇంటి చుట్టూ ఫీవర్ సర్వే, యాంటీ లార్వా సర్వే నిర్వహించారు. డెంగ్యూ వ్యాధిని వ్యాప్తి చేసే దోమలు తాగునీటిలో పెరుగుతాయన్నారు. వారానికి ఒకసారి డ్రైడే పాటించి నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులను శుభ్రం చేసి మళ్లీ పట్టుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ నాగ శ్రీను, హెల్త్ అసిస్టెంట్ రామునాయుడు, ఏఎన్‌ఎం పద్మావతి, ఆశ వర్కర్, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.


బాలిక ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం జరిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మర్రిపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్-2 పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మర్రిపాలెం సెక్షన్ పరిధిలో 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్, 11 కేవీ ఏపీఐఐసీ ఫీడర్ నిర్వహణ ప్రక్రియలో భాగంగా మొత్తం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఏరియా అంతా విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ఆటో ఢీకొని వృద్ధురాలికి గాయాలు

మర్రిపాలెం: ఆటో ఢీకొని ఓ వృద్ధురాలు గాయపడిన ఘటన కంచరపాలెం పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కప్పరాడ సమీపంలో ఇందిరానగర్-2 ప్రాంతానికి చెందిన టేకుపూడి దేముడమ్మ(65) అనే వృద్ధురాలు శనివారం హైవే ఊర్వశి జంక్షన్ నుంచి ఇందిరానగర్‌కు సర్వీసు రోడ్డులో వెళ్తుండగా.. వెనుక నుంచి ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె చేతికి గాయమైంది. ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో దేముడమ్మ ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.